


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 230, పేజీలు - 08

బుధవారం, ఫిబ్రవరి 4, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## కాంగ్రెస్ ఎమ్మెల్యేకు టెన్షన్

### - మున్సిపల్ ఎన్నికలు ముప్పు తెస్తాయా.?

(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)



తెలంగాణలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలకు మున్సిపల్ ఎన్నికలు కత్తిమీద సాములా మారాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుచుకుని తీరి రావాల్సి ఉంది. ఈ ఫలితాలు ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేసే అవకాశం పార్టీకి నాయకత్వానికి లభిస్తుంది. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఈ నెల 11వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయింది.

ఇంకా వారం రోజులు మాత్రమే సమయం ఉంది. బీఫారం దక్కని అభ్యర్థులుఅసంతృప్తితో ఉన్నారు. వారు అనేక చోట్ల ఆందోళనలకు కూడా దిగుతున్నారు. వారిని బుజ్జగించి పార్టీ కోసం పనిచేయించడం ఒక రకంగా తలకు మించిన భారంగానే చూడాలి.

**- పార్టీ మారిన నియోజకవర్గాల్లో**

గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. గద్వాల్, జగిత్యాల వంటి నియోజకవర్గాల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు అక్కడి కాంగ్రెస్ ఇన్ ఛార్జులకు అభ్యర్థుల ఎంపికపై విభేదాలు తలెత్తాయి. జగిత్యాలలో అయితే ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ వర్గానికి ముప్ఫయి వార్డులు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ఇరవై వార్డులు ఇచ్చాయి. మధ్యే మార్గంగా సర్దుకుపోవాలని చెప్పినా అందుకు ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు అంగీకరించడం లేదు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోనూ రెబల్స్ బెడద ఎక్కువగా ఉంది. దీంతో కొందరు అభ్యర్థులు స్వతంత్రులుగా పోటీ చేస్తుండగా, మరికొందరు బీజేపీ, బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు.

**- ఉప సంహరణ గడువు ముగియడంతో**

అధికార పార్టీలోనే ఈ రెబల్స్ తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. నామినేషన్ల ఉపసంహరణకు గడువుముగియడంతో స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి బరిలోకి దిగిన వారు పోటీ నుంచితప్పుకోవడానికి ససేమిరా అంటున్నారు. ఇది నేతలకు తలనొప్పిగా మారింది. మరొకవైపు గుర్తులు కేటాయించిన తర్వాత వారు ప్రచారంలోకి దిగితే ఓట్లు చీలిపోయి ఓటమికి కారణమవుతుందన్న భయం నేతల్లో కనపడుతుంది. పదవుల హామీలు ఇస్తున్నప్పటికీ చాలా మంది ఇంకా రెబల్స్ రంగంలోనే ఉన్నారు. అనేక చోట్ల తిరుగుబాటు అభ్యర్థులు ఉండటంతో ఓట్ల చీలిక కాంగ్రెస్ ను ఎటు వైపు నడిపిస్తుందన్నది వేచి చూడాలి.మొత్తం మీద దాదాపు ఎక్కువ నియోజకవర్గాల్లో అసంతృప్తుల బెడద ఎక్కువగా ఉండటంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది.

## నేనూ తెలంగాణ జాతిపితనే

### - మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను సిట్ అధికారులు విచారణ చేయడం పట్ల ఆ పార్టీ తీవ్రంగా మండిపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన మహానేతను అవమానిస్తున్నారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గులాబీ శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ జాతిపిత అంటూ బీఆర్ఎస్ నేతలు కొనియాడుతుండగా కాంగ్రెస్ నేతలు మాత్రం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలకు తెరతీశారు. కేసీఆర్ జాతిపిత అయితే తాను కూడా తెలంగాణ జాతిపితనే అంటూ వ్యాఖ్యానించారు. నల్గొండలో మంగళవారం పర్యటించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులే నిజమైన

2లో..

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత

### - తెలంగాణ ఎంపీ సహా 8 మందిపై వేటు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత

2లో..

## తిరుమల లడ్డూలో కల్తీ వ్యవహారం

### - సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
- సిట్ నివేదిక, ఛార్జ్‌షీట్‌లో తేడాలు ఉన్నట్టు గుర్తింపు
- అసలు వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ రాజకీయాలలో తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను ప్రభావితం చేసే అంశం కావటంతో ఈ విషయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్రమంలోనే ఈ విషయం మీద నిజానిజాలు వెలుగుతీసేందుకు సుప్రీంకోర్టు సీబీఐ నేతృత్వంలో సిట్ కూడా ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం ఇటీవల నెల్లూరు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. అయితే ఈ ఛార్జ్‌షీట్ గురించి కూటమి పార్టీలు, వైసీపీ మధ్య ప్రస్తుతం ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశం గురించి విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎం నారా చంద్రబాబు నాయుడు

2లో..

## ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీం క్లారిటీ

### - ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డంకిగా లేవని స్పష్టం



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయం, గత ప్రభుత్వ హయాం నుంచి ఎడతెగని సమస్యగానే మారింది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, గవర్నర్ కోటా కింద పంపించిన పేర్లను అప్పటి గవర్నర్ తిరస్కరించారు. ఆ తర్వాత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మరో ఇద్దరి పేర్లను సిఫార్సు చేయగా మొదట ఎంపిక చేసిన అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈ గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో కాంగ్రెస్ సర్కార్ పంపించిన నియామకాలను రద్దు చేసిన సుప్రీంకోర్టు తమ తదుపరి ఉత్తర్వులకు లోబడే ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయాలని తేల్చి చెప్పగా తాజాగా తమ ఉత్తర్వులు

2లో..

## ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి

### - పార్లమెంటు వద్ద వైసీపీ ఎంపీల నిరసన



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ ఎంపీలు నిరసనకు దిగారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ నిరసనతో పాటుగా నినాదాలు చేసారు. ఏపీలో కొద్ది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలకు నిరసనగా ఎంపీ లు కొత్త డిమాండ్లు తెర మీదకు తెచ్చారు. ఏపీలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని.. కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి చోటు చేసుకుంటున్న

2లో..

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

- వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి
- ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇటీవల భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. ఈ బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్– 2047 కోసం పెట్టిన బడ్జెట్ అని పేర్కొన్నారు. సుస్థిర లక్ష్యాలను ప్రజలు అందుకునే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ లో నిర్వహించిన సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే కేంద్ర బడ్జెట్ పై పలు రాజకీయ పార్టీలు తప్పుగా ప్రచారం

2లో..

## విశాఖ రైల్వేస్టేషన్‌లో దొంగలను పట్టించిన రోబోకాప్

### - ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో నిందితుల గుర్తింపు



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో భద్రతా విధుల్లో ఉన్న 'ఏఎస్‌సీ అర్జున్' అనే హ్యూమనాయిడ్ రోబో తన సత్తా చాటింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత రోబో, ఇద్దరు పాత నేరస్థులను గుర్తించి, వారిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం,

2లో..

## ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో కీలక పరిణామం

- కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు
- అనర్హత పిటిషన్‌పై విచారణకు రావాలని ఆదేశాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదాన్ని హీటెక్కిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు.

2లో..

## ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం

### - భారత రక్షణ రంగంలో కీలక ముందడుగు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల (ఎయిర్–టు–ఎయిర్ మిసైల్స్) తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది. మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో

2లో..

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం

### - వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో, రైతుల ప్రయోజనం అంశంపై భారత ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం జరిగిందని,

2లో..

# నేనూ తెలంగాణ జాతిపితనే

జాతిపితలు అని కొనియాడారు. సోనియా గాంధీ తెలంగాణ దేవత అని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అయితే తానూ జాతిపితనే అని అన్నారు. తెలంగాణ కోసం తన సొంత పార్టీ కాంగ్రెస్‌ను కూడా ఎదిరించానని చెప్పిన కోమటిరెడ్డి తనకు వచ్చిన పదవులకు రాజీనామాలు చేసి సర్వస్వం కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ గానీ కోమటిరెడ్డి గానీ ఎన్నటికీ తెలంగాణ జాతిపితలు కాలేరని వ్యాఖ్యానించారు.మరోవైపు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ పార్టీకికు ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికల్లో జరిగిందే మళ్లీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం కాబోతోందని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ కనిపించకుండా పోవడం ఖాయమని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని 5 కార్పొరేషన్లు, 90 మున్సిపాలిటీలను తమ పార్టీ కైవసం చేసుకుంటుందని నల్లగొండ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తామని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఇప్పటికే నల్గొండ నియోజకవర్గంలో 1000 మంది పేదలకు ఇళ్లు కట్టించామని అప్లై చేసుకున్న వెంటనే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతోందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అందించే సన్నబియ్యాన్ని పేదలు ఇష్టంగా తింటున్నారని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు తాను కూడా అవే రేషన్ బియ్యాన్ని తింటున్నట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన రేషన్ బియ్యం తిన లేక వాటిని పక్కదారి పట్టించేవారని మంత్రి గుర్తుచేశారు.

# లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత

రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# తిరుమల లడ్డూలో కల్తీ వ్యవహారం

అధ్యక్షతన మంగళవారం ఏపీ కేబినెట్ భేటీ జరిగింది. ఈ మంత్రివర్గ సమావేశంలో లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై సిట్ నివేదిక, అందులోని అంశాలు, తాజా రాజకీయ పరిస్థితులపై మంత్రి మండలి చర్చించింది. అనంతరం తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంపై విచారణ కమిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ ఏర్పాటు చేసిన సిట్ ఈ విషయంలో కేవలం పాత్రధారులపై మాత్రమే చర్యలకు సిఫార్సు చేసిందని మంత్రివర్గం అభిప్రాయపడింది.మూడు గంటలపాటు ఈ విషయం మీద ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలో అసలు సూత్రధారులను కనిపెట్టేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిషన్ సమర్పించే నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. మరోవైపు ఈ విచారణ కమిషన్ సీబీఐ సిట్ విచారణతో పాటుగా.. కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్, అనంతరం ప్రభుత్వానికి సమర్పించిన అంశాలపై అధ్యయనం చేయనుంది. ఈ మూడింటిలోనూ తేడాలు ఉన్నట్లు కేబినెట్‌లో చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే విచారణ కమిషన్ ద్వారా దీనిపై అధ్యయనం జరపాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అనంతరం విచారణ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు సీబీఐ సిట్ నివేదికలో తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యి అసలు నెయ్యే కాదని పామాయిల్ వంటి పదార్థాలు ఉపయోగించారని పేర్కొన్నట్లు కూటమి పార్టీలు చెప్తున్నారు. అయితే జంతువుల కొవ్వు లేదంటూ సీబీఐ సిట్ చెప్పిందని.. అబద్ధాలు చెప్పినందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది

# ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీం క్లారిటీ

ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకి కాదని స్పష్టం చేసింది. ఎమ్మెల్సీ ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు మరోసారి స్పష్టతను ఇచ్చింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలను ఎంపిక చేసేందుకు తాము ఇచ్చిన ఉత్తర్వులు అడ్డంకిగా లేవని తేల్చి చెప్పింది. 2025 ఆగస్ట్ 13వ తేదీన ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లోనే ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు తెలిపింది. రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని వెల్లడించింది.అయితే తన ఎన్నికపై ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ ఖాన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దానిపై జస్టిస్ విక్రంనాథ్ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపింది. అదే సమయంలో అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో కలిపి ఆదేశాలు ఇచ్చిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది. 2023లో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ కేబినెట్ నిర్ణయించి అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సిఫార్సు చేశారు. వీరికి రాజకీయ పార్టీతో సంబంధాలు ఉన్నాయని రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) పేర్కొన్న ప్రకారం సంబంధిత రంగాల్లో వీరికి ప్రతిభ లేదని పేర్కొంటూ వారిద్దరని నామినేషన్లను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు.ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్ట్ అమిర్ అలీఖాన్ పేర్లను ప్రభుత్వం సిఫార్సు చేయగా గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. అయితే ఈ నియామకాలను సవాల్ చేసిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ, మొదట తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి ఆ తర్వాత సుప్రీంకోర్టుకు ఎక్కారు. ఈ పిటిషన్లపై గతేడాది ఆగస్ట్ 13వ తేదీన విచారణ జరిపిన సుప్రీంకోర్టు కోదండరామ్, అమిర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీ నియామకాలను రద్దు చేసింది. తమ తదుపరి ఉత్తర్వుల ఆధారంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయాలని కోర్టు స్పష్టం చేసింది.ఇక తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులను ఎత్తివేయాలని అమిర్ అలీ ఖాన్ సుప్రీంకోర్టును కోరగా తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఎంపిక చేసేందుకు తమ ఉత్తర్వులు అడ్డంకిగా లేవని తాజాగా స్పష్టం చేసింది. అయితే ఖాళీ అయిన ఆ రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి మళ్లీ ప్రొఫెసర్ కోదండరామ్‌కే కేటాయించగా మరో స్థానాన్ని మాత్రం ప్రస్తుతం నేరుగా మంత్రి పదవి దక్కించుకున్న అజారుద్దీన్‌కు కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీల ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డంకి కావన్న సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో తర్వాత ఏం జరగబోతోంది అనేది తీవ్ర ఉత్కంఠను కలిగిస్తోంది.

# ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి

పరిణామాలను వివరించారు. ఢిల్లీ కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అంబటి అనుచిత వ్యాఖ్యలు, టీడీపీ కేడర్ ఆగ్రహంతో అంబటి ఇంటి పైన దాడి చేయటం సంచలనంగా మారింది. ప్రభుత్వం అంబటి ఇంటి మీద దాడి చేసిన టీడీపీ నేతల పైన కేసులు నమోదైంది. అదే విధంగా జోగి రమేశ్ ఇంటి పైన దాడి జరిగింది. అక్కడ దాడి చేసిన వారిని సీసీ కెమేరాల ల ద్వారా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసారు. కాగా, ఈ విషయం పైన ఢిల్లీ స్థాయిలో నిరసనలు చేయాలని వైసీపీ నిర్ణయించింది. దాడులు జరిగిన సమయంలో మాజీ సీఎం జగన్ చేసిన ట్వీట్ లో సైతం హోం శాఖ ను, గవర్నర్ ను ట్యాగ్ చేస్తూ దాడులను ఖండించారు. ప్రభుత్వం పైన జగన్ విమర్శ లు గుప్పించారు. ఇక.. అంబటి, జోగి రమేశ్ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించాని జగన్ డిసైడ్ అయ్యారు. నేడు గుంటూరులో, శుక్రవారం జోగి రమేశ్ కుటుంబాన్ని పరామర్శించేలా ప్లాన్ చేసుకున్నారు.

### - ఢిల్లీ స్థాయిలో నిరసనలకు ప్రణాళికలు

కాగా, వైసీపీ కి లోక్ సభ రాజ్యసభ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణం ముందు నిరసనకు చేసారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడిని నిరసిస్తూ వైసీపీ ఎంపీల ఆందోళన చేసిన ఎంపీలు ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేసారు. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి. శాంతి భద్రతలను పరిరక్షించాలని నినదించారు. రాష్ట్రపతి పాలన విధించాలి అని వైఎస్సార్‌సీపీ ఎంపీలు కేంద్రాన్ని డిమాండ్ చేసారు.

ఇదే సమయంలో జాతీయ స్థాయిలో కొన్ని రాజకీయ పక్షాలను కలిసి ఏపీలో పరిణామాలను వివరించాలని డిసైడ్ అయ్యారు. ఈ సాయంత్రం పార్టీ ముఖ్య నేతలతో జగన్ సమావేశం కానున్నారు. నేరుగా కేంద్రానికి జగన్ లేఖ రాయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దాడులు జరిగిన విజువల్స్ తో సహా ఫిర్యాదు చేసేందుకు సిద్దం అవుతున్నట్లు సమాచారం. పార్టీ నేతల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేయనున్నారు.

# హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

నిర్వహిస్తున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకానికి ఈ ఏడాది బడ్జెట్ లో గతేడాది కంటే 9 శాతం అధికంగా నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు 5 వందే భారత్, 2 అమృత్ భారత్ రైళ్లను కేటాయించిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న కాలంలో రూ.5.50 లక్షల కోట్లతో 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. అలాగే హైదరాబాద్- యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ మూడో దశ పనులకు త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజ చేస్తారని తెలిపారు. ఇక మేడారం జాతరకు కేంద్రం ప్రకటించిన రూ. 3.70 కోట్లు నిధులను రాష్ట్రానికి తీసుకొచ్చే బాధ్యత తనదేనని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే ప్రతి జిల్లాకు బాలికల వసతి గృహం రాబోతున్నట్లు వివరించారు. దాంతోపాటు హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతోందని తెలిపారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు భ్రష్టు పట్టించాయని కిషన్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు దివ్యాంగజనుల సాధికారతకు ప్రధాని తీసుకున్న చర్యలపై కిషన్ రెడ్డి ట్వీట్ చేశారు. "దివ్యాంగజనుల సాధికారతకు ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ 2026-27లో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. పరిశ్రమల అవసరాలకు అనుగణంగా నైపుణ్య శిక్షణ, తక్కువ ధరలో నాణ్యమైన సహాయక పరికరాలు వంటి కార్యక్రమాల ద్వారా వారి అభివృద్ధికి బాటలు వేసింది. దివ్యాంగజన్ కౌశల్ యోజన. ఉపాధి అవకాశాలు పెంచేందుకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, దివ్యాంగ సహారా యోజన, అందుబాటు ధరలో నాణ్యమైన సహాయక పరికరాలు, పీఎం దివ్యాశ కేంద్రాలు ఒకేచోట దివ్యాంగులకు కావాల్సిన పరికరాలు, ఫిట్టింగ్, మరమ్మతులు, సేవలు అలీమ్ కో మద్దతు అధునాతన సాంకేతికతలను వినియోగించి తక్కువ ధరలో అత్యాధునిక సహాయక పరికరాలను అందించడం.

# విశాఖ రైల్వేస్టేషన్‌లో దొంగలను పట్టించిన రోబోకాప్

సోమవారం రాత్రి 8.10 గంటల సమయంలో స్టేషన్ ప్రాంగణంలో 'అర్జున్' విధుల్లో ఉంది. అప్పటికే నేరస్థుల వివరాలు, ఫొటోలను రోబోలో అప్‌లోడ్ చేసి ఉంచారు. స్టేషన్‌లో తిరుగుతున్న ఇద్దరు అనుమానితులను రోబో తన కెమెరాతో చిత్రీకరించి, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా పాత నేరస్థులుగా గుర్తించింది. వెంటనే ఈ సమాచారాన్ని, సీసీటీవీ ఫుటేజీ వివరాలను కంట్రోల్ రూమ్‌కు పంపింది.రోబో నుంచి సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ బీఎస్. నారాయణ, ఎస్సై వి. కీర్తి రెడ్డి నేతృత్వంలోని బృందాన్ని అప్రమత్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి శివ, బంగారు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ప్రయాణ టికెట్లు కూడా లేవని గుర్తించారు. విచారణలో వీరిద్దరిపై రాయగడ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు తేలింది. దీంతో కేసు నమోదు చేసి, రాయగడ పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ జనసంచారంతో నిత్యం కిటకిటలాడే రైల్వే స్టేషన్‌లో ఏఐ ఆధారిత రైల్ రోబోకాప్ 'ఏఎస్సీ అర్జున్' ద్వారా నేరస్తులను రియల్‌టైమ్‌లో గుర్తించి పట్టుకోవడం గొప్ప విజయమని తెలిపారు. ఈ ఘటన ఏఐ టెక్నాలజీ రైల్వే భద్రతను ఎంత ప్రభావవంతంగా మెరుగుపరుస్తుందో స్పష్టంగా చూపిస్తోందని, ప్రయాణికులకు మరింత సురక్షిత ప్రయాణాన్ని అందించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో కీలక పరిణామం

నేడు ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

### - అనర్హత వేటుపై బీఆర్‌ఎస్ పట్టు

ఎన్నికల గుర్తుపై గెలిచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయకుండానే వేరే పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్‌ఎస్ వాదిస్తోంది. కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయడంలో జాప్యం జరుగుతోందని గతంలోనే ఆ పార్టీ నేతలు హైకోర్టును కూడా ఆశ్రయించారు. విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. అనర్హత పిటిషన్లపై చర్యలు తీసుకోవాలని, ఎందుకు జాప్యం చేస్తున్నారని పలుమార్లు సుప్రీంకోర్టు స్పీకర్ ను ఆదేశించి. కోర్టు ఆదేశాలతో స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. రేపటి విచారణలో కడియం శ్రీహరి తన వాదనలను వినిపించనున్నారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా స్పీకర్ తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

### - సంచలనంగా మారిన దానం నాగేందర్ అఫిడవిట్

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అనర్హత పిటిషన్‌పై స్పీకర్‌కు సమర్పించిన అఫిడవిట్ రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను ఉల్లంఘించలేదని, ఇప్పటికీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీకి రాజీనామా చేయలేదని వాదించారు. గత మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు భావించడం సరికాదని దానం పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ తనను సస్పెండ్ చేయలేదని చెబుతూ, చట్టపరమైన లొసుగుల ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించుకునే ఆయన ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సుప్రీంకోర్టు గడువు సమీపిస్తున్న వేళ దానం వినిపించిన ఈ వింత వాదన బీఆర్‌ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### - ఈ ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్

అనర్హత పిటిషన్ ఎదుర్కొన్న ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణ మోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్‌ఎస్ సభ్యులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ పిటిషన్లను విచారణ చేస్తున్నారు. ఇటీవల దానంను విచారించగా, తాజాగా కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

# ఎస్‌ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం

ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్-లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు.ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్‌ఈఎంఆర్‌ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, సంబంధిత పరిశ్రమలను అభినందించారు. ఇది భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం

అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ పోస్టు నేపథ్యంలో విపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్రం స్పందించింది. అమెరికా మన దేశానికి ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు మొదటి నుంచి అంగీకరించడం లేదని స్పష్టం చేసింది. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనూ అదే విషయాన్ని స్పష్టం చేశామని పేర్కొంది. వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలలో ఉందని తెలిపింది.

ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు మనం వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయలేదని, ఇప్పుడు వాటిని ఎత్తివేశారని పేర్కొన్నారు. చమురు కొనుగోలు చేస్తామన్నారు. అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు చాలా తక్కువకు వస్తాయి. వాటిపై సుంకాలు తగ్గిస్తే మన దేశంలో రైతులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇంతకాలం వాణిజ్య చర్చల ప్రతిష్ఠంభనకు ఇది ప్రధాన కారణం. మన రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి వాణిజ్యం ఒప్పందం కోసం కేంద్రం ఆసక్తి చూపలేదు. ఇప్పుడు వాణిజ్య ఒప్పందం కుదరడంతో వస్తున్న విమర్శలకు కేంద్రం స్పష్టతనిచ్చింది.

# గోన సంచిలో మృతదేహం

**కామారెడ్డి** కామారెడ్డిలో గోన సంచిలో సగం మృతదేహం కలకలం రేపింది. గుర్తు తెలియని దుండగులు ఒక వ్యక్తిని హత్య చేసి ముక్కలుగా చేసి పడేసారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో గోన సంచిలో మనిషి కాళ్లు చూసి చెత్త ఏరుకునే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని చూడగా, గోన సంచిలో నడుము నుండి కాళ్ల వరకు మాత్రమే ఉన్న మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మిగతా మృతదేహం గురించి వెతికినా దొరకకపోవడంతో, కేసు నమోదు చేసి, మృతుడి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

### జువారి సిమెంట్ కర్మాగారం ఎదుట

# వలస పల్లె గ్రామ ప్రజల ఆందోళన

**కడప** వలసపల్లె గ్రామ ప్రజలు టువారి సిమెంట్ కర్మాగారం ముందు అందోళనకు దిగారు. గ్రామంలోని సమాధులను పరిశ్రమ యాజమాన్యం తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమకు సంబంధించిన సున్నపురాయి గని నుంచి వెలువడే భారీ పేలుడుకు నివాస గృహాలు దెబ్బ తింటున్నాయాంటున్నారు. కర్మాగారం నుంచి వెలువడే కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని పరిశ్రమ యాజమాన్యం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వలస పల్లె గ్రామ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

# వర్ధన్నపేటలో వాడివేడిగా ఎన్నికల ప్రచారం

**వరంగల్** వరంగల్ జిల్లా వర్ధన్నపేట లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం వాడి వేడిగా కొనసాగుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యే నాగరాజు ను ప్రశ్నిస్తూ బిజెపి నేతలు 15 అంశాలతో కూడిన ఛార్జ్ షీట్ ను విడుదల చేశారు. వర్ధన్నపేటలో నెలకొన్న సమస్యలను చార్జి సీట్లో ప్రస్తావిస్తూ గడిచిన రెండేళ్లుగా ఎమ్మెల్యే నాగరాజు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతికత కోల్పోయిందన్న నేతలు బిజెపి బలపరిచిన అభ్యర్థులు 12 డివిజన్లలో విజయకేతనం ఎగరవేయనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు.

# వర్ధన్నపేట అభివృద్ధి ఘటన కేసీఆర్ దే

**వర్ధన్నపేట** గ్రామపంచాయతీగా ఉన్న వర్ధన్నపేట ను మున్సిపాలిటీగా మార్చి.. 200 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కొనియాడారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహ సమావేశంలో పాల్గొన్న ఆయన తరువాత మీడియాతో మాట్లాడారు. గత రెండేళ్లుగా వర్ధన్నపేట మున్సిపాలిటీలో తట్టెడు మట్టిని కూడా ఎత్తని కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో ఓటు అడిగే హక్కే లేదని ఆరురి రమేష్ ఎద్దేవా చేశారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం..వంద పడకల ఆసుపత్రిని వర్ధన్నపేటలోనే నిర్మిస్తామని దొంగ హామీలు ఇస్తూ మరో మారు అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు చూస్తున్నాడని విమర్శించారు. వర్ధన్నపేట ప్రజలు చైతన్యవంతులని.. కాంగ్రెస్ నాయకుల కాకమ్మ కబుర్లకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని ధీమా వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్పాట్ డెడ్



**సంగారెడ్డి** జహీరాబాద్-బీదర్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం ప్రమాదం చోటుచేసుకుంది. న్యాల్కల్ మండల పరిధిలోని గణేష్ పూర్ వద్ద మినీ ట్రక్కు ఆటోను బలంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.
గంగ్వార్ నుంచి బీదర్ వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వడ్డీ గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ కమల(40)తో పాటు ఝరాసంగం మండలం భోజ్యానాయక్ తండకు చెందిన అంబ్యానాయక్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న మరో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బీదర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదంతో జహీరాబాద్ బీదర్ రోడ్డుపై వాహన రాకపోకలు స్తంభించాయి. పోలీసులు చేరుకుని ఢీకొట్టిన వాహనాలను పక్కకు తప్పించి రాకపోకలు పునర్ధరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

# తెల్లని దుప్పటిలా సిద్దిపేట

**సిద్దిపేట** సిద్దిపేట పట్టణం మొత్తం పొగమంచిఉ దట్టంగా అలుముకుంది. మంగళవారం ఉదయం 9 గంటలైనా మంచు వీడకపోవడంతో కాశ్మీర్ను తలపించింది. రాజీవ్ రహదారితో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ముందు ఏమీ కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని వాహనదారులు ప్రయాణిస్తున్నారు. కోమటి చెరువు వద్ద ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వాకర్రప్ ఆస్వాదించారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వేగం తగ్గించి డ్రైవ్ చేయాలని అధికారుల సూచన

# దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ పై ప్రమాదం

### - బైకు దగ్ధం



**హైదరాబాద్** మాదాపూర్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై ప్రమాదవశాత్తు బైకులో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వాహనదారుడు బైకును పక్కనే పార్కింగ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. బైకు మంటల్లో పుర్తిగా కాలిపోయింది.ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కావడంతో అధికారులు ఊపిరి పిల్చుకున్నారు.

# ఎన్నికల సంఘం నియమాలను అనుసరించే గుర్తుల కేటాయింపు

**మున్సిపల్ సాధారణ ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావాలకు తావు లేదని మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకు రవి కిరణ్ అన్నారు.మంగళవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవోలు ,మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. వెస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను పరిశీలించారు.ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ.. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా, నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, ఎన్నిక జరగాలని, ఎవరైనా బలవంతంగా ప్రలోభాలు చేసిన, బెదిరించిన, చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నికల సంఘం నియమాలను అనుసరించే గుర్తుల కేటాయింపు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఇంటర్ విద్యాధికారులకు సూచించారు. మంగళవారం కూల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ను పరిశీలించారు. ల్యాబ్ రూముల్ని, ల్యాబ్ మెటీరియల్ పరిశీలించి, ప్రాక్టికల్స్ ఏ విధంగా జరుగుతున్నాయి అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల రికార్డులను,సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థులు ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా చేసుకొని, ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు స్పెషల్ క్లాసులు అటెండ్ కావాలన్నారు. ఈ నెల 10 వ తేదీ వరకు జరగనున్న ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా జరగాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యాధికారి మాధవి, చీఫ్ సూపరింటెంట్ నవీన్, కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల

# నామినేషన్ ఉపసంహరణ

**- భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి**

**మహబూబ్నగర్** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నామినేషన్ ఉపసంహరణ, బీఫారం సమర్పణ ప్రక్రియ కొనసాగుతున్న దృష్ట్యా, మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా విధుల నిర్వహణపై పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ ఉపసంహరణ మరియు బీ?ఫారం సమర్పణ ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అభ్యర్థులు, వారి అనుచరులు మరియు ప్రజలు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నామినేషన్ ఉపసంహరణ, బీ?ఫారం సమర్పణకు చివరి రోజు కావడంతో, ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భనలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మరియు ఇతర సిబ్బంది ఉన్నారు.

# టికెట్ ఇవ్వలేదు

**కన్నీళ్లు పెట్టుకున్న మహిళ నేత**

**జగిత్యాల** కాంగ్రెస్ మహిళా నాయకురాలు తనకు మునిసిపల్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదని జీవన్ రెడ్డి ఇంటికి వచ్చి కన్నీరు పెట్టుకుంది. కాంగ్రెస్ పార్టీ మెట్పల్లి పట్టణ మహిళా అధ్యక్షురాలు హరిత కన్నీటి పర్యంతరం అయింది. ఎనిమిది సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న హరిత, మున్సిపల్ ఎన్నికల్లో హరితకు 24వ వార్డు టికెట్ ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని కంటతడి పెట్టుకుంది. ఇటీవల పార్టీలో చేరిన గణేష్ కు టికెట్ ఇవ్వటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసానికి వచ్చి రోదించింది.

## మంథని మున్సిపల్ బిఆర్ఎస్ అభ్యర్థులను

# ప్రకటించిన పుట్ట మధు

**మంథని** మంథని మున్సిపాలిటీ బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులనుబిఆర్ఎస్ మంథనినియోజకవర్గ ఇంచార్జ్ పుట్ట మధూకర్ మంగళవారం ప్రకటించారు. బిఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి 13 మంది అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు.1వ వార్డు అభ్యర్థిగా గంధం ఆంజనేయులు, 2వ వార్డు అభ్యర్థిగా ఆరెపల్లి కుమార్, 3వ వార్డు అభ్యర్థిగా మాచీడి రాజుగౌడ్, 4వ వార్డు అభ్యర్థిగా బడికల లావణ్య శ్రీనివాస్, 5వ వార్డు అభ్యర్థిగా అంబటి నర్సింగ్, 6వ వార్డు అభ్యర్థిగా కాయితీ జ్యోతి సమ్మయ్య,7వ వార్డు అభ్యర్థిగా మంథని సంధ్య హరీష్,8వ వార్డు అభ్యర్థిగా కొత్త పద్మ, 9వ వార్డు అభ్యర్థిగా దాసరి పుష్ప మల్లేష్, 10వ వార్డు అభ్యర్థిగా బండారి సమ్మయ్య, 11వ వార్డు అభ్యర్థిగా పుప్పాల తిరుపతి, 12వ వార్డు అభ్యర్థిగా పూదరి లావణ్య సాగర్,13వ వార్డు అభ్యర్థిగా మంథని విజయ్ కుమార్‌లను ఎంపిక చేసి ప్రకటించారు.

# రాజకీయాలకు అతీతమైన బంధం - ముత్తమ్మ - ఆది శ్రీనివాస్ అనుబంధం

**- పెన్షన్ రూపంలో ఓ తల్లి ఆశీర్వాదం**
**- ముత్తమ్మను మరువని విప్ ఆది**
**- ముత్తమ్మ స్మృతిలో.....**

**ఆది శ్రీనివాస్ భావోద్వేగ నివాళి**





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో అరుదుగా కనిపించే మానవీయ కోణాన్ని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరోసారి చాటుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన గెలుపు కోసం ఆశీర్వదిస్తూ, తన పెన్షన్ సొమ్మునే విరాళంగా ఇచ్చిన వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు బొమ్మ ముత్తమ్మను ఆయన ఎప్పటికీ మరువలేదని ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా "నువ్వు తప్పకుండా గెలవాలి బిడ్డా" అంటూ ముత్తమ్మ తన చేతిలో ఉన్న పెన్షన్ డబ్బులను విరాళంగా అందించి, ఆది శ్రీనివాస్ విజయాన్ని హృదయపూర్వకంగా కోరుకున్నారు. ఆ తల్లితన ఆశీస్సులు ఫలించి, ప్రజల మద్దతుతో ఆయన ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు.విజయం అనంతరం కూడా ఆ ఆశీర్వాదాన్ని మరచిపోని ఆది శ్రీనివాస్, స్వయంగా ముత్తమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు పాదాభివందనం చేశారు. పట్టు చీరను అందించి, తన గెలుపులో ఆమె ఆశీర్వాదం కీలకమని గౌరవప్రదంగా వ్యక్తం చేశారు.ఇటీవల ముత్తమ్మ మరణవార్త తెలిసిన వెంటనే ఆది శ్రీనివాస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వెంటనే గ్రామానికి చేరుకొని ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించారు. భావోద్వేగంతో అంజలి ఘటిస్తూ, "నా రాజకీయ ప్రయాణంలో ఆమె ఆశీర్వాదం ఎప్పటికీ మార్గదర్శకంగా ఉంటుంది" అని పేర్కొన్నారు. ముత్తమ్మ ఆశీర్వాదం, ఆది శ్రీనివాస్ కృతజ్ఞత --- ఇవి రాజకీయాలకు అతీతంగా మానవీయ విలువలను ప్రతిబింబిస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

**ఎన్నికల పరిశీలకులు కొర్ర లక్ష్మి వెల్లడి**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని మూడు చింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఎన్నికల సందర్భంగా పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, ఆదిశగా విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలికులు మాట్లాడుతూ పోలింగ్ రోజున పోలింగ్ బూతులలో ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని జాగ్రత్తగా పరిశీలించి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ బూతులలో చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలన చెసుకోవాలని, అలాగే పోలింగ్ బూతు లోపల, బయట నిరంతరం సూక్ష్మ పరిశీలన చేస్తుండాలని తెలిపారు. పూర్తి స్థాయి లో శిక్షణ తీసుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే క్లియర్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మైక్రో అబ్జర్వర్లు జనరల్ అబ్జర్వర్ల ఆధ్వర్యంలో పని చేయాల్సి ఉంటుందని, ప్రతి పోలింగ్ బూతు కి ఒక మైక్రో అబ్జర్వర్ నియమించడం జరుగుతుందని, విధులు నిర్వహించే సమయంలో తప్పకుండ గుర్తింపు కార్డు ధరించి ఉండాలని సూచించారు. పోలింగ్ ముందు రోజే మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని మాక్ పోలింగ్ విధానాన్ని, ఓటర్లు ఓటింగ్ చేసే విధానం, అదేవిధంగా పోలింగ్ ఏజెంట్ల నియామకాన్ని క్షుణ్ణంగా పరిశీలన చెయాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ అధికారుల పని విధానాన్ని పరిశీలన చేయాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒక్కసారి ఓటింగ్ శాతంని తెలుసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవాంఛిత సంఘటనలు జరిగే పరిస్థితులను గమనిస్తూ, ఏవైనా ఉంటే పై అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. పోలింగ్ అధికారి పోలింగ్ బూతు లో జరిగే అంశాలను పిఓ డైరీ లో నమోదు చేస్తున్న తీరును పరిశీలిస్తూ ఉండాలని అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ఏ సమయానికి ప్రారంభం, ఏ సమయానికి ముగుస్తుందో నమోదు చేయాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ బూతులో వెళ్తున్న వారికి ఓటర్ గుర్తింపు కార్డు, ఇతర సమానమైన గుర్తింపు కార్డులు ఉన్నాయా లేదా గమనించాలని అన్నారు. ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించారా లేదా చూడాలని అన్నారు. ఒకవేళ సమయం ముగిస్తే ఎంతమంది క్యూలో నిలబడి ఉన్నారో వారికి స్లిప్ లు ఇచ్చారా లేదా అని గమనించాలని సూచించారు. పోలింగ్ ముగిశాక ఫారం లు సరిగా నింపారా లేదా అనే అంశాన్ని రిపోర్ట్ లో నమోదు చేయాలని సూచించారు. తదుపరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లు చేపట్టే విధి విధానాలపై మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు.

# చిలగడదుంపతో ఎన్ని ప్రయోజనాలో

**- బరువు తగ్గడంలో సహాయపడే చిలగడదుంప**
**- జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే ఫైబర్**
**- చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెను కాపాడే గుణం**

ప్రకృతి మనకు ప్రసాదించిన ఆరోగ్యకరమైన ఆహారాల్లో చిలగడదుంపకు ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ ధరకే లభించే ఈ దుంపలో శరీరానికి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీన్ని రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక రకాల అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చిలగడదుంపలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది చక్కటి ఆహారం. కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలిగి, అనవసరమైన స్నాక్స్ తినకుండా నియంత్రిస్తుంది. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో చిలగడదుంప కీలకపాత్ర పోషిస్తుంది. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే, కాలేయాన్ని ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంచడంలోనూ ఇది తోడ్పడుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న చిలగడదుంపను ఉడకబెట్టుకుని లేదా కూరగా చేసుకుని తినవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం దీనిని మీ ఆహారంలో భాగం చేసుకోవడం ఎంతో మంచిది.



# కాంగ్రెస్... బిజెపికి మధ్యలో సింహం

**- పురపోరుకు సమాయత్తం**
**- కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో మూడో వంతు బి.ఆర్ ఎస్ వారే**
**- బిఆర్ఎస్ పై ఆసక్తి చూపని పలువురు అభ్యర్థులు**
**- బలంగా కనిపిస్తున్న సింహం**
**- సింహం అభ్యర్థులు ఎంపికలో ఆచుతూచి నిర్ణయం**
**- జాగృతి ప్రచారంతో సింహంకు పెరగనున్న బలం**

**పెద్దపల్లి** :పెద్దపల్లి పుర పోరులో ఆయా పార్టీల నాయకులు తమ ఆ యుధాలను సిద్ధం చేసుకుం టున్నారు. నామినేషన్ల ప్రక్రి య పూర్తి చేసుకున్న ఆయా పార్టీల అభ్యర్థులు తమ బీఫా రాలను ఎన్నికల అధికారుల కు సమర్పించారు. నేటితో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయింది. ఇక రేపటి నుండి అభ్యర్థుల ప్రచారాల్లో తలమునకలై సాగనున్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో ఎవరికి వారే గెలుపు తమదే అన్న రీతిలో ప్రచారాలు సాగిస్తున్నారు. పైకి కనిపించకుండా ఎవరి లెక్క లు వారివే అన్నట్టు వారి వారి ప్రయత్నాల్లో మునిగి తేలుతు న్నారు. ఈ క్రమంలో ప్రధానం గా బిజెపి, కాంగ్రెస్ మధ్య పో టీ ఉంటుందనే విషయాన్ని గ్ర హిస్తే అందులో సింహం గుర్తు ఏఐఎఫ్ బీ అనే పార్టీ వచ్చి చేరింది. బీసీ కార్డుతో ముందు కు వచ్చి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించుకొని గెలుపు ధీమాతో ఉన్న మాజీ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ 26 మంది అభ్యర్థులతో నామి నేషన్ వేయించాడు. ఈ పార్టీ ప్రచారం కోసం జాగృతి రాష్ట్ర వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మె ల్సీ కవిత రానున్నారు. కానీ ఒక విషయం ఆలోచన చేస్తే పెద్దపల్లిలో మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా వ్యక్తులను చూసి ఓట్లు వేసే సంప్రదాయం ఉంది. ఎక్కువ గా అధికార పార్టీ ఏది ఉంటే దానికే బలం ఉంటుందనేది గత పదేళ్లుగా మనం చూస్తూ నే వున్నాము. కానీ పెద్దపల్లి లో మాత్రం ఎవరికి అవకాశం ఇస్తారో ఎవర్ని తొక్కేస్తారనే విషయం మాత్రం ఇక్కడి ఓటర్ల నిర్ణయమే. గత ఎన్నిక ల అంశాలను పరిశీలిస్తే ఈ విషయం చాలా సూటిగా కనిపిస్తున్నది. ఇక ప్రస్తుత మున్సిపల్ పోరులో మాత్రం కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థు ల్లో మూడోవంతు మంది టిఆర్ఎస్ పార్టీ నుండి వచ్చిన వారే. ఇందులో చాలామంది గతంలో చేసిన కొన్ని పొరపా ట్లు, అవినీతి, ప్రజల వద్ద డబ్బులు దండుకోవడం వల్ల వారికి గెలుపు పెద్ద సమస్యగా మారనున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అందుకే చాలామంది కాంగ్రెస్ లో చేరి పార్టీ కండువా కప్పుకొని బీఫామ్ టికెట్ పొందారు. అ యితే అప్పటికే టికెట్ ఆశిస్తున్నా కాంగ్రెస్ లోని చాలామంది అభ్యర్థులు, సీనియర్లు వారి రాకను వీళ్ళు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ పక్క బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్ తో పలువురి స్థానాలు కూడా మారాయి. దీనివల్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు విషయంలో భయాందోళనలో వున్నారు. ఇక అసలు విష యానికి వస్తే బిఆర్ఎస్ పైన కొంత వ్యతిరేకత ఉన్నవాళ్లు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చే అవకాశం ఉండేది కానీ ఇప్పుడు ఆ బిఆర్ ఎస్ వాళ్లే కాంగ్రెస్ లో చేరడంతో ఇటు బిఆర్ఎస్ కు కాకుండా అటు కాంగ్రెస్ కు కాకుండా సింహాని కి లేదా బిజెపికి ఓట్లు వేసే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయంగా పేర్కొంటున్నా రు. బీజేపీలో ఒక అంశం తీసు కుంటే ఇప్పటికీ వర్గ పోరు, అంతర్గత విభేదాలు నాయకు ల్లో బహిరంగంగానే బయటప డిన సంఘటనలు ఉన్నాయి. అలాగే ప్రస్తుతం బీసీ కార్డు ఉద్యమం బలంగా ఉండటం, దీనికితోడు సింహం గుర్తుపై పోటీ చేసే అభ్యర్థుల్లో కొంత మందికి అన్ని వర్గాల నుండి సానుభూతి, జాగృతి తరుపు న కవిత రావడం ద్వారా కూ డా టిఆర్ఎస్ నుండి ఓట్లు పడే అవకాశాలు కనిపిస్తున్నా యి. ఇది వారి ఓటు బ్యాంకు కు కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి. ఏది ఏమైనా మూడు పార్టీల్లో అభ్యర్థులు కూడా బలంగా ఉండటం గెలుపును నిర్ణయించడం కష్టమే మరి....

## పేద విద్యార్థులకు అండగా
# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ

- బోయినిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు : భూమయ్య
- "మిషన్ టెన్త్ క్లాస్ - చదువుకో తెలంగాణ" గోడప్రతి ఆవిష్కరణ




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ టెన్త్ క్లాస్ – చదువుకో తెలంగాణ" కార్యక్రమం భాగంగా రూపొందించిన పోస్టర్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమయ్య, ఉపాధ్యాయులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ వేములవాడ అజయ్, ఎగ్జిక్యూటివ్స్ సాయిల్ల రాకేష్, నరేష్, నిఖిల్, డెవలప్‌మెంట్ ఆఫీసర్,ఉదారి నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హెచ్ఎమ్ భూమయ్య మాట్లాడుతూ, ఈ కార్యక్రమం పేద విద్యార్థులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుందని, వారి విద్యాభ్యాసానికి దోహదపడుతుందని కొనియాడారు.

# హడల్ పుట్టిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అనూష రెడ్డి

- గ్రామాలలో విస్తృతంగా పర్యటనాలో వాహనాల తనిఖీలు
- శభాష్ అనిపించు కుంటున్న అనుషా రెడ్డి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఆమె మేడ్చల్ డిప్యూటీ తహసిల్దార్ అనూష రెడ్డి . అయితే ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ గా నియమించారు. అనూష రెడ్డి ఫ్లయింగ్ స్కార్డుగా నియామకమైన రోజు నుండి హడల్ పుట్టిస్తుంది. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు విధులను నిర్వహిస్తూ దడ పుట్టిస్తుంది. వాహనాలను తనిఖీలు చేస్తూ, ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాలను పర్యటిస్తుంది. మద్యం సరఫరా, డబ్బులు పంపకాలు వంటి సమాచారం అందగానే నిమిషంలో అక్కడికి చేరుకొని విస్తృతంగా తనిఖీలు చేస్తూ హడల్ పుట్టిస్తుంది. శభాష్ ఫ్లయింగ్ స్కాడ్ అనూష రెడ్డి అని అభ్యర్థులు అంటున్నారు ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ మనం దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పెద్ద ఎత్తున డబ్బులు గాని మద్యం కానీ సరఫరా చేయవద్దని, ఒకవేళ చేస్తూ పట్టుబడితే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే మా బాధ్యత అని, ఎవరు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని సూచించారు. మద్యం, డబ్బులు సరఫరా చేస్తున్నట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా క్షణంలో అక్కడ ఉంటానని ఫ్లయింగ్ స్క్వాడ్ అనుష రెడ్డి తెలిపారు.

# ఇతర పార్టీల వారు ఇచ్చే డబ్బు తీసుకోండి

- బిఆర్ఎస్ కు ఓటు వేయండి - ఎమ్మెల్యే మల్లారెడ్డి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఇతర పార్టీల వారిచే డబ్బు తీసుకొని బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని రావల్ కోల్ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు వివిధ పార్టీల నేతలు డబ్బులు పంచుతారని, ఆ డబ్బుల ను తీసుకొని బిఆర్ఎస్ మాత్రమే ఓటు వేయాలని సూచించారు. గతంలో తెలవక కాంగ్రెస్ కు ఓటేసి తప్పు చేశారని, ఇప్పుడు ఆ తప్పు చేయకుండా బిఆర్ఎస్ కు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఘాటుగా విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలన్ని సస్యశ్యామలంగా ఉండేవని, ఇంటింటికి మంచినీరు, నిరంతరం కరెంటు సరఫరా, చెరువులన్నీ జలకల సంతరించుకొని ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల లో అభివృద్ధి అంత ఉంటూ పడ్డదని విమర్శించారు. గ్రామాలలో మంచినీటి కటకట ఉందని, కరెంటు సక్రమంగా రావడంలేదని, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని ఘాటుగా విమర్శించారు. మరో రెండేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని,కుంటు పడ్డ గ్రామాలన్నీ అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎల్లంపేట మున్సిపాలిటీలో మెజార్టీ స్థానాలను గెలుచుకొని ఎల్లంపేటపై గులాబీ జెండాను ఎగురవేయాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అభ్యర్థులు, నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గుండెపోటు వస్తే ఏం చేయాలో తెలుసా? డాక్టర్ ఇచ్చిన సలహా



గత కొన్ని సంవత్సరాలుగా గుండెపోటు కేసుల సంఖ్య వేగంగా పెరిగింది. ట్రైగ్లిజరైడ్లు, చెడు కొలెస్ట్రాల్ గుండెపోటుకు కారణమవుతున్నాయి. అయితే చాలా మంది ఒంటరిగా ఉన్నప్పుడు గుండెపోటు కేసులు ఎక్కువగా నమోదయ్యాయని నివేదికలు చెబుతున్నాయి. కొంతమందికి గుండెపోటు లక్షణాలు గంటల తరబడి లేదా రోజుల ముందుగానే ప్రారంభమవుతాయని నిపుణులు చెబుతున్నారు. మరికొందరిలో, అవి నిమిషాల్లోనే తీవ్రంగా మారవచ్చు. అయితే, ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గుండెపోటు వస్తే ఏం చేయాలో డాక్టర్ వివరించారు. భారతదేశంలో గుండెపోటు కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వార్తల్లో గుండెపోటుకి సంబంధించిన కేసులు గురించి మనం చూస్తూనే ఉన్నాం ఓ నివేదిక ప్రకారం 40 ఏళ్ల వయసు ఉన్నవారిలో గుండెపోటుల సంఖ్య 25 నుంచి 30 శాతం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఎలాంటి హెచ్చరిక లేకుండా వస్తోన్న ఆకస్మిక గుండెపోటు కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు.అంతేకాకుండా అదే సమయంలో సకాలంలో సరైన చికిత్స అందకపోవడం చాలా మంది మరణానికి కారణమవుతుంది. ఇంకా ఈ రోజుల్లో గుండెపోటు గురించి రోజురోజుకీ ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ప్రముఖ యూఎస్ వైద్యుడు కార్డియోవాస్కులర్ సర్జన జెరెమీ లండన్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశారు. ఈ వీడియోలో ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు

గుండెపోటు వస్తే ఏం చేయాలో చెప్పారు.గుండెపోటు అనేది ప్రమాదకరమైన పరిస్థితి. అలాంటి సమయంలో భయపడటం వల్ల ప్రాణాల్ని కాపాడుకోవడం కష్టమవుతుంది. అయితే, కొంచెం సాధారణ జ్ఞానం, ధైర్యం ఉంటే చికిత్స అందేవరకు సురక్షితంగా ఉండొచ్చు. 25 సంవత్సరాల అనుభవం ఉన్న కార్డియోవాస్కులర్ సర్జన్ డాక్టర్ జెరెమీ లండన్, ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గుండెపోటు వస్తే ఏం చేయాలో వివరించారు. ఆ పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### ఎమర్జెన్సీ నంబర్కి కాల్ చేయండి

మీకు గుండెపోటు వచ్చినట్టు అనిపించి.. అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వండి. ఇంట్లో ఎవరు లేకపోతే.. వెంటనే అత్యవసర నెంబర్క్ కాల్ చేసి వారి విషయం తెలియజేయడం చాలా ముఖ్యమని డాక్టర్ అంటున్నారు. మీరు స్పీడ్ డైల్ పెట్టుకుంటే వెంటనే ఎవరో ఒకరికి ఈ విషయాన్ని తెలియజేసి అప్రమత్తం చేయండి. 1 లేదంటే అంబులెన్స్ నెంబర్కి ఫోన్ చేయాలని డాక్టర్ సూచిస్తున్నారు. మీరు స్పృహలో ఉండగానే, మిమ్మల్ని సంప్రదించగల లేదా ఆలస్యం చేయకుండా సాయం అందించగల కుటుంబ సభ్యుడికి లేదా స్నేహితుడికి వెంటనే కాల్ చేయండి. మీ పరిస్థితి గురించి వారికి తెలియజేయడానికి వారితో లైన్లోనే ఉండండి.

మీరు చేయాల్సిన రెండో పని ఆస్ప్రిన్ నమలడం అని కార్డియాలజిస్ట్ వివరించారు. గుండెపోటు సమయంలో ఆస్ప్రిన్ టాబ్లెట్ని ఎప్పుడూ మింగడానికి ప్రయత్నించొద్దు. బదులుగా, దానిని మీ దంతాలతో నమలండి. ఈ ఔషధం గుండెపోటు తీవ్రతను తగ్గిస్తుంది. ఇది గుండెపోటును నిరోధించదు, కానీ షాక్ని తగ్గిస్తుంది. అంటే పరిస్థితి తీవ్రం కాకుండా చూస్తుందని డాక్టర్ చెబుతున్నారు.

### డాక్టర్ ఇచ్చిన సలహా ఏంటో చూడండి

మీరు ఇంట్లో ఒంటరిగా ఉండి గుండెపోటు వస్తే, సాయం కోసం ప్రజలు మిమ్మల్ని సంప్రదించగలిగేలా మీ తలుపులను అన్లాక్ చేయమని డాక్టర్ చెబుతున్నారు. అంతేకాకుండా లైట్లు ఆన్ చేయమని డాక్టర్ లండన్ సలహా ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు మిమ్మల్ని సులభంగా చేరుకోగలిగేలా తలుపులు తెరిచి ఉంచడం ఉత్తమం అని ఆయన అభిప్రాయపడుతున్నారు.

### కూర్చోండి లేదా పడుకోండి

గుండెపోటు వల్ల మీరు మూర్ఛపోయి పడిపోవచ్చు. స్పృహ కోల్పోయిన తర్వాత త్వరగా పడిపోవడం వల్ల తలకు గాయాలు కావచ్చు. ఇవి గుండెపోటు సమయంలో ప్రమాదకరం. అందువల్ల, మీకు అసౌకర్యంగా అనిపించిన వెంటనే లేదా ఇబ్బంది కలిగినా వెంటనే పడుకోండి లేదా కూర్చోండి. ఇది మీరు పడిపోకుండా నిరోధిస్తుంది. అంతేకాకుండా తల, శరీరంలోని ఇతర భాగాలకు గాయాలు కాకుండా నిరోధిస్తుందని డాక్టర్ చెబుతున్నారు.

### గుండెపోటుని ఎలా గుర్తించాలి?

గుండెపోటు వచ్చినప్పుడు ఛాతీలో భారం లేదా బిగుతుగా ఉన్నట్టు అనిపిస్తుంది. ఇది కొన్ని నిమిషాలు ఉంటుంది లేదా వచ్చి వెళుతుంది. ఈ నొప్పి దవడ, భుజం, చేయి లేదా వీపుకు వ్యాపించవచ్చు. శ్వాస ఆడకపోవడం, వికారం, తల తిరగడం లేదా అధిక చెమట కూడా సాధారణ లక్షణాలు.

కొంతమంది ముఖ్యంగా షుగర్ ఉన్నవారు, మహిళలు.. తీవ్రమైన అలసట, అజీర్ణం లేదా పై వెన్నునొప్పి వంటి అసాధారణ లక్షణాలను అనుభవించవచ్చు. గుండెపోటు వల్ల రక్తస్రావం, గడ్డకట్టడం, ఊపిరితిత్తుల్లో ద్రవం చేరడం లేదా మూత్రపిండాలు దెబ్బతినడం వంటి వివిధ సమస్యలు వస్తాయి. అందువల్ల, వెంటనే వైద్య సాయం తీసుకోవాలి.

# గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ప్రత్యేక చొరవతో పశువులకు నీటి సౌకర్యం

- ఏడాది తర్వాత పశువులకు తాగునీరు - రైతుల్లో ఆనందం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలోని పశువుల పాక వద్ద ఉన్న బోరు గత ఏడాదిగా చెడిపోయి ఉండడంతో పశువులకు తాగునీటి సదుపాయం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ప్రత్యేక చొరవ తీసుకొని సదరు బోరుకు మరమ్మతులను మంగళవారం చేయించారు.దీంతో ప్రస్తుతం పశువులకు తాగునీటి సమస్య తీరింది. బోరు పునరుద్ధరణతో గ్రామ రైతులు, పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, గ్రామంలో పశుసంవర్ధక రంగంపై ఆధారపడిన రైతులు అధికంగా ఉన్నారని, పశు వులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటం గ్రామ పంచాయతీ బాధ్యత అని అన్నారు. బోరు చెడిపోవడంతో పశువులకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలియజేయగానే వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఇకపై ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, గ్రామ అభివృద్ధి, రైతుల సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కమిటీకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందనలు

- అధ్యక్షుడు సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వక భేటీ



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** ఉప్పల్ ప్రింట్ ఢ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన అధ్యక్షుడు సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు ఉప్పల్ నియోజకవర్గం శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, సమాజాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల విజయవంతమైన అమలులో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల వరకు సమర్థవంతంగా తీసుకెళ్లడంలో మీడియా మిత్రుల సహకారం అవసరమని తెలిపారు. రాబోయే రోజుల్లో ఉప్పల్ ప్రింట్ ఢ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా హిత కార్యక్రమాలకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, కుమార్ యాదవ్, కీర్తి సంతోష్ రాజ్, నాగరాజు, ప్రశాంత్, సురేష్, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# యువత కోసం మైదానం సుందరీకరణ

- సర్పంచ్ నల్ల మోహన్‌కు అభినందనలు
- యువత ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న గ్రామ సర్పంచ్ నల్5మోహన్




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్ర గ్రామంలో యువతకు ఉపయోగపడే విధంగా గ్రామ సర్పంచ్ నల్ల మోహన్ ఆధ్వర్యంలో మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. గ్రౌండ్‌లో మట్టి పోసి చదును చేయడంతో పాటు సుందరీకరణ పనులు చేపడుతున్నారు.ముందు ముందు నిర్వహించనున్న పోలీస్ రిక్రూట్మెంట్, పారామిలిటరీ బలగాలు మరియు ఎస్సెస్సీ జీడీ, (సి ఐ ఎస్ ఎఫ్,సీఆర్పీఎఫ్,బీఎస్ఎఫ్, ఐటీబీపీ,ఎస్సెస్బి ఢిల్లీ పోలీస్ తదితర) నియామకాల కోసం గ్రామ యువత సక్రమంగా ప్రాక్టీస్ చేయడానికి ఈ మైదానం ఉపయోగపడనుంది.ఈ సందర్భంగా గ్రామ యువత సర్పంచ్ నల్ల మోహన్‌తో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం అని పేర్కొన్నారు.

# మైనంపల్లి హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ అతిక్, సహేత్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ మున్సిపాలిటీల్లో 20వ వార్డు సున్నం నరేష్, రాధ 6వ వార్డు శ్రీకాంత్ మరియు 5వార్డు అతిక్, సహేత్ తో పాటు పలువులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ పట్టణ అభివృద్ధికి ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపాలిటీ చైర్మెన్ చంద్రపాల్, మ్యాడం బాలక్రిష్ణ, మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, బొద్దుల కృష్ణ, గోదాల సాయి, రాగి అశోక్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## అందుకే అతనికి
# బ్రేకప్ చెప్పా!

కెరీర్ ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు గతం తాలూకు చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ఎవరికీ ఇష్టం ఉండదు. ముఖ్యంగా కథానాయికలు ఈ విషయంలో చాలా జాగ్రత్తలు పాటిస్తారు. కానీ మరాఠీ భామ మృణాల్ ఠాకూర్ అందుకు భిన్నం. తాజా ఇంటర్వ్యూలో మాజీ ప్రియుడి గురించి నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసిందీ భామ. తన వ్యక్తిగత ఇష్టాలను, స్వేచ్ఛను ఏ మాత్రం గౌరవించని వ్యక్తి కాబట్టే అతన్నుంచి దూరంగా వచ్చానని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది.'నేను ప్రతీ విషయంలో నిర్మొహమాటంగా, దూకుడు మనస్తత్వంతో ఉంటాను. అది అతనికి నచ్చలేదు. తన పద్ధతులకు అనుగుణంగా ఉండాలని కోరుకునేవాడు. సినిమాల్లో నటించడం కూడా అతనికి ఇష్టం లేదు. అందుకే ఆ బంధం నుంచి బయటపడ్డా. బ్రేకప్ అయిపోయినందుకు ఏమాత్రం బాధపడలేదు. అతని కురచ మనస్తత్వం చూసి జాలి పడ్డాను.అలాంటి వారితో కలిసి ప్రయాణించడం చాలా కష్టం. అందుకే గుడ్‌బై చెప్పాను' అని మృణాల్ ఠాకూర్ తెలిపింది. గత కొన్ని నెలలుగా ఈ సొగసరి ప్రేమాయణం గురించి సోషల్‌మీడియాలో బాగా ప్రచారం జరుగుతున్నది. ధనుష్‌తో ఆమె ప్రేమలో ఉందని వార్తలొచ్చాయి. అయితే ఈ ప్రచారాన్ని మృణాల్ ఖండించింది. ఇద్దరం మంచి మిత్రులమని, ఆధారాలు లేని కథనాల్ని ప్రచారం చేయొద్దని కోరింది.

# 1950 దశకం నాటి కథ

మలయాళ హీరో టొవినో థామస్ నటిస్తున్న పీరియాడిక్ మూవీ 'పళ్లి చట్టంబి'. డీజో జోస్ దర్శకుడు. కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నది. ఏప్రిల్ 9న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. బుధవారం కథానాయిక కయాదు లోహర్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 1950-60 దశకం మధ్య వలస రైతుల నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని, ఆధిపత్యానికి వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం స్ఫూర్తివంతంగా ఉంటుందని, కథాగమనంలో హీరోయిన్ కయాదు లోహర్ పాత్ర కీలకంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. విజయ రాఘవన్, సుధీర్ కరమన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: టీజో టోమీ, సంగీతం: జేక్స్ బిజోయ్, దర్శకత్వం: డిజో జోస్ ఆంటోనీ.



## ధనుష్‌తో మరోసారి జతకడుతున్న
# సాయిపల్లవి..
### డీ55లో హీరోయిన్‌గా నేచురల్ బ్యూటీ



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, నేచురల్ బ్యూటీ సాయిపల్లవి కాంబినేషన్ అంటే ప్రేక్షకులకు మొదట గుర్తొచ్చేది 'రౌడీ బేబీ' పాట. 'మారి 2' చిత్రంలోని ఈ పాటకు ప్రేక్షకుల ఫిదా అవ్వడంతో పాటు వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి మార్కులు పడ్డాయి. అయితే ఇప్పుడు దాదాపు ఆరేళ్ల తర్వాత ఈ క్రేజీ జోడీ మరోసారి వెండితెరపై సందడి చేయబోతున్నట్లు తెలుస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా రాబోతున్న ఛ55 లో సాయిపల్లవి హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా తీసుకున్న చిత్రబృందం మరో హీరోయిన్ పాత్ర కోసం సాయి పల్లవిని సంప్రదించగా.. సాయి పల్లవి ఒకే చెప్పినట్లు తెలుస్తుంది

. ఈ సినిమాకు అమరన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న రాజ్ కుమార్ పెరియాస్వామి దర్శకత్వం వహించబోతున్నాడు. 'వండర్‌బార్ ఫిల్మ్స్' సంస్థ ఈ సినిమాను నిర్మించబోతుంది.

# దైవ రహస్య ఛేదనలో నాగబంధం

విరాట్‌కర్ణ హీరోగా నటిస్తున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగ బంధం'. అభిషేక్ నామా దర్శకుడు. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న సినిమా టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. 'పురాతన ఆలయంలో రహస్య నిధిని రక్షించే మహా సర్పం చుట్టూ నడిచే కథాంశమిది. భారతదేశంలోని చారిత్రాత్మక విష్ణు దేవాలయాల నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. ఓ దైవిక రహస్యాన్ని ఛేదిస్తూ ప్రేక్షకులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది. విజువల్స్ అబ్బురపరుస్తాయి' అని చిత్రబృందం పేర్కొంది. నిర్మాణం తుదిదశకు చేరుకుందని, ఈ వేసవిలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, జయప్రకాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్, సంగీతం: అభే, జునైద్ కుమార్, నిర్మాతలు: కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అభిషేక్ నామా.



## కశ్మీర్ నేపథ్యంలో రాచరికం
# డైరెక్టర్ కొత్త సినిమా 'వింటర్'





రాచరికం సినిమాతో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు సురేష్ లంకలపల్లి. ఈ చిత్రం మంచి టాక్ తెచ్చుకుంది. కాగా ఈ టాలెంటెడ్ డైరెక్టర్ క్రేజీ టైటిల్‌తో కొత్త సినిమాను లాంచ్ చేశాడు. కశ్మీర్‌లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రాబోతున్న ఈ సినిమాకు 'వింటర్' టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ చిత్రానికి సురేశ్ లంకలపల్లి కథ, స్క్రీన్‌ప్లే కూడా అందిస్తున్నాడు. రిజ్వాన్ అలీ, రామ్, ఆదిత్య సూరజ్ సింగ్, కుసుమ చందక, శశికళ, శ్రీజిత, శ్రీజిత ఘోష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని క్రిసెంట్ సినిమాస్, టీఎస్ఆర్ మేకర్స్ బ్యానర్లపై రియాజ్ అహ్మద్, టీ శ్రీనివాస రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇంతకీ వింటర్ మూవీలో డైరక్టర్ ఎలాంటి ఘటనలను చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది.

## ఇరవై ఏండ్లు
# గుర్తుండిపోవాలి!




'ఈ సినిమాలో నేను మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తా. ఈ కథ ఇరవై ఏళ్ల పాటు గుర్తుండిపోవాలనే తపనతో పనిచేశాను. నా మనసుకు నచ్చిన గొప్ప కథ ఇది' అన్నారు సంతోష్ శోభన్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మిస్తున్నది.మానస వారణాసి కథానాయిక. నిర్మాత ధీరజ్ మొగిలినేని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఫీల్‌గుడ్ రొమాంటిక్ మూవీ ఇదని దర్శకుడు తెలిపారు.ఈ సినిమా చూసిన అనుభూతిలో చాలా రోజులు ఉండిపోయానని, ఎన్నో ప్రేమకథలు చూస్తుంటాం కానీ ఇదొక విభిన్నమైన కాన్సెప్ట్ అని ధీరజ్ మొగిలినేని చెప్పారు. ఈ సినిమాలో తాను మిత్ర అనే ధైర్యవంతురాలైన అమ్మాయిగా కనిపిస్తానని, చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే క్యూట్ లవ్‌స్టోరీ ఇదని కథానాయిక మానస వారణాసి చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్, రచన-దర్శకత్వం: అశ్విన్ చంద్రశేఖర్.

# భార్యపై కోపంతో.. అత్తింటి వారిపై కత్తితో దాడి




**హన్మకొండ(ప్రశ్న న్యూస్)** హన్మకొండ న్యూశాంపేటలో భార్యపై కోపంతో అత్త, బావమరిదిపై కత్తితో దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. భార్యాభర్తల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో, భార్య లేని సమయంలో అత్త ఇంటికి వెళ్లి ఆమె భర్త (బావమరిది) మరియు అత్తపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో అత్త, బావమరిది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించడంతో, క్షతగాత్రులను రోహిణి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లిఫ్ట్ ఇచ్చాడు.. కత్తి పోటుకు గురయ్యాడు

- నల్గొండలో దారుణ ఘటన
- ప్రాణాలతో బయటపడ్డ కారు యజమాని ఇమ్రాన్



**నల్గొండ (ప్రశ్న న్యూస్)** నల్గొండ జిల్లాలో మానవత్వాన్ని దుర్వినియోగం చేసిన దారుణ ఘటన చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా కేంద్రం నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం తన కారులో హైదరాబాద్ బయలుదేరిన ఇమ్రాన్ అనే వ్యక్తి, మార్గమధ్యలో నార్కెట్‌పల్లి వద్ద లిఫ్ట్ అడిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తిని మానవతా దృక్పథంతో కారులో ఎక్కించుకున్నాడు. అయితే చిట్యాల సమీపానికి చేరుకోగానే, ఆ వ్యక్తి అకస్మాత్తుగా ఇమ్రాన్‌పై కత్తితో దాడి చేశాడు. ఇమ్రాన్ మెడతో పాటు శరీరంపై విచక్షణ లేకుండా కత్తిపోట్లకు పాల్పడి, అతని సెల్‌ఫోన్, నగదు లాక్కునేందుకు దుండగుడు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాల మధ్య కూడా ఇమ్రాన్ ధైర్యంగా ప్రతిఘటించడంతో, భయాందోళనకు గురైన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇమ్రాన్‌ను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అతడిని తక్షణమే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. హైవేలపై లిఫ్ట్ ఇచ్చే విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రానికి పాన్ ఇండియా సహకారం




**నాచారం(ప్రశ్న న్యూస్)** నాచారం ఇంద్రనగర్ అంగన్వాడీ కేంద్రానికి ఎస్బిఐ పాన్ ఇండియా సి ఎస్ ఆర్ నిధుల క్రింద పాన్ ఇండియా వారు టీవీ, ఆట వస్తువులు, స్టడీ మెటీరియల్, వాటర్ ఫిల్టర్, రైస్ కుక్కర్, లాంటి ఉపయోగకరమైన వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ స్వాతి మాట్లాడుతూ, ఎస్బిఐ సిఎస్ఆర్ నిధుల ద్వారా అంగన్వాడి కేంద్రానికి సహకారం అందించడం పట్ల పాన్ ఇండియా వారిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. వారు అందించిన వస్తువులు అంగన్వాడి కేంద్రానికి ప్రీ స్కూల్ పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఈ నాచారం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ షేక్ అమీర్ హంజ, మిత్ర హోలీ స్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, ఐసిడిఎస్ అల్వాల్ సిడిపిఓ స్వాతి, సూపర్వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై జి హెచ్ ఎం సి కమిషనర్‌తో కొలన్ హన్మంత్ రెడ్డి భేటీ




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజాసమస్యలపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి జి హెచ్ ఎం సి కమిషనర్ ఆర్ వి కర్ణన్, మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మౌలిక సదుపాయాల లోపాలు, అభివృద్ధి పనుల ఆలస్యం డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి పలు కీలక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కమిషనర్ సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి స్పష్టం చేశారుఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోల సంజీవ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం 16వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థి గెలుపు ఖాయం : గౌతం గోవర్ధన్

- పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కీలక సమావేశం
- ప్రచారంలో దూసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు గౌతం గోవర్ధన్ పిలుపు
- రామగుండం కార్పొరేషన్ లో బోణీ కొడతాం





**రామగుండం ( ప్రశ్న న్యూస్ )** రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో 16వ డివిజన్‌లో సిపిఐ పార్టీ అభ్యర్థులుగా కడారి స్వరూప--లింగయ్య దంపతులు పోటీ చేస్తున్న నేపథ్యంలో, వారి గెలుపు కోసం పార్టీ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గౌతం గోవర్ధన్ విచ్చేశారు. ఈ మేరకు పార్టీ లోకల్ నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఏఐటియూసి నాయకులు అన్నారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకాష్, బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్, బుర్ర తిరుపతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతం గోవర్ధన్ మాట్లాడుతూ, 8 ఇంక్లైన్ కాలనీలో ఉన్న 7 డివిజన్లలో సిపిఐ పార్టీ కేవలం 16వ డివిజన్‌లోనే పోటీ చేస్తున్నదని అందువల్ల ఈ 7 డివిజన్లలో ఉన్న సిపిఐ, కార్మిక సంఘం ఏఐటియూసీ నాయకులు అందరూ ఒక ప్రణాళికాబద్ధంగా ప్రచారంలో పాల్గొని మన అభ్యర్థి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రామగుండం 2 బ్రాంచ్ సహాయ కార్యదర్శులు శ్యాంసన్, గంధం సాంబశివరావు,మామిడి మహేందర్, మోటపలుకుల మహేందర్, సెగ్గం శంకర్, చిట్టెంపల్లి మహేందర్, బొంత రాజు, జాడి ఆంజనేయులు, అల్లి రమేష్, సాగే కృష్ణ, వెంకటేష్, శ్రీనివాస్, పిడుగు రమేష్, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంతో 16వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం మరింత వేగవంతం చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

# విద్యార్థి దశలో కష్టపడితే... జీవితమంతా సుఖ సంతోషాలే

- చదువును ఆయుధంగా మల్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి - బీసీ వసతి గృహ విద్యార్థులకు 'ప్రేరణ' కల్పించిన కలెక్టర్



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ప్రేరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్, విద్యార్థులకు పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. ఉన్నత చదువు చదివి జీవితంలో స్థిరపడేందుకు పదవ తరగతి మొదటి మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు అన్ని విధాలా సంసిద్ధులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం వసతి గృహాల్లో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. వార్షిక పరీక్షలు సమీపించినందున చదువు పైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వ్యాపకాల వైపు దృష్టి పెడితే విలువైన సమయాన్ని కోల్పోతారని అన్నారు. చదువు కష్టంగా అనిపించిన ప్రతీసారి తల్లితండ్రులు పడే కష్టాన్ని గుర్తు చేసుకుని మరింత కసి, పట్టుదలతో చదవాలని హితబోధ చేశారు. పాఠాలను బట్టీ పట్టకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే అది జీవితాంతం పనికి వస్తుందని ఉద్బోధించారు. ముఖ్యంగా బాలికలు మరింత పట్టుదలతో రాణించాలని, తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ బడుల్లో చదివే వారు ఏ విషయంలోనూ వెనుకబడి ఉండరని విద్యార్థుల్లో కలెక్టర్ ఆత్మవిశ్వాసం కల్పించారు. చక్కగా చదువుకుని అందరూ 10 గ్రేడ్ పాయింట్స్ సాధించాలని, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు. పది పరీక్షల్లో ప్రతిభను చాటితే బిగ్ స్క్రీన్ పై టి.20 వరల్డ్ కప్ లైవ్ మ్యాచ్ చూసేలా ఏర్పాట్లు చేయిస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పరీక్షలు సమీపించిన ప్రస్తుత తరుణంలో సమయం ఏమాత్రం వృధా కాకుండా విద్యార్థులకు పునఃశ్చరణ జరిపించాలని ఉపాధ్యాయులకు, సంక్షేమ వసతి గృహాల నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు.

చక్కటి వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునేందుకు వీలుగా అనువైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న, వసతి గృహాల నిర్వాహకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రోత్సాహకం అభినందనీయం

- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్
- "చదువుకో తెలంగాణ" గోడప్రతి ఆవిష్కరణ




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి పోలీస్ ఠాణాలో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతిని మంగళవారం స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలు సాధించగలరని, వారికి సరైన ప్రోత్సాహం అందితే అద్భుత ఫలితాలు సాధ్యమని అన్నారు. చదువుతోనే వ్యక్తిగత పురోగతి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 'మిషన్ 10వ తరగతి' కింద రాష్ట్రవ్యాప్తంగా రూ. 2.2 కోట్ల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి టాపర్లకు లక్షల రూపాయల ప్రోత్సాహకాలు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లోనూ నగదు బహుమతులు అందజేయనున్నారని,ఈ పథకం 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తించనుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఎస్సై రమాకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ సంస్థ గంగాధర శాఖ ప్రతినిధులు,భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి,తదితరులు పాల్గొన్నారు.

# పిఓ, ఎంపీఓల రాండమజేషన్ ద్వారా ఎంపిక




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులు నిర్వహించుటకు గాను పిఒ, ఎపిఓలను రాండమైజేషన్ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేశారు. మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ లో సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి, జిల్లా కలెక్టర్ మను చౌదరిల సమక్షంలో మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు సంబంధించిన 68 వార్డులకు గాను 136 పోలింగ్ బూతులలో 818 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లను రం డమైజేషన్ ద్వారా పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించడానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, డిఈఓ విజయ కుమారి, సివిల్ సప్లై డిఎం సుగుణ బాయి, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎఓ సుజాత పాల్గొన్నారు.

# వకీల్‌పల్లి మైన్ ఉద్యోగులకు అన్యాయం చేస్తే ఊరుకోం : ఏఐటియూసీ

- ఉత్తర్వులు సవరించాలని ఏఐటీయూసీ సంఘం ధర్నా




**రామగుండం(ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లా పరిధిలోని వకీల్‌పల్లి మైన్, ఆర్జీ--2 ఏరియాలోని సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ ఖాళీలను వకీల్‌పల్లి మైన్ ఉద్యోగులతో మాత్రమే భర్తీ చేయాలని గుర్తింపు సంఘం, లోకల్ యూనియన్ అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ధర్నాకు దిగింది. ఈ మేరకు సింగరేణిలోని అన్ని ఏరియాలకు చెందిన ఉద్యోగులకు వకీల్ పల్లి మైన్ లో అవకాశం కల్పిస్తూ యాజమాన్యం జారీ చేసిన కొత్త సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మైన్ మేనేజర్ కి మెమోరాండం సమర్పించారు. గతంలో సత్తుపల్లిలో సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ ఖాళీలను కొత్తగూడెం డివిజన్ ఉద్యోగులతో భర్తీ చేసేందుకు సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం, ఇప్పుడు ఆర్జీ--2 ఏరియాలోని ఖాళీలను సింగరేణి అన్ని ఏరియాల నుంచి భర్తీ చేయాలని సర్క్యులర్ ఇవ్వడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండించింది. గత పద్ధతి ప్రకారమే ఆర్జీ--2 ఏరియాలో అర్హత గల స్థానిక కార్మికులతోనే సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ ఖాళీలను భర్తీ చేయాలని సంఘం డిమాండ్ చేసింది. అలాగే పై క్యాటగిరీలో పనిచేస్తున్న ఉద్యోగులు సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్‌గా ఎంపికైతే బేసిక్ ప్రొటెక్షన్ కల్పించాలని కోరారు. అదేవిధంగా వకీల్‌పల్లి మైన్‌లో స్టాట్యూటరీ ట్రైనింగ్ చేసిన ఉద్యోగులకు రెండు నెలలు మొత్తం జీతాన్ని రికవరీ చేసి జీరో పేమెంట్ వచ్చేలా చేసిన యాజమాన్య చర్యను తీవ్రంగా ఖండిస్తూ, రికవరీ చేసిన జీతాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్. ప్రకాష్, బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్ , బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి. అన్నారావు, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు మామిడి మహేందర్, బొట్ల సంపత్, పిట్ కార్యదర్శి బొంత రాజు, అలాగే నాయకులు వెంకటేష్, నరేష్, భూమయ్య, రాకేష్, నాగరాజు, శ్యాం, అజయ్, అభినవ్ తో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# చేతులెత్తే పద్ధతిలో..
# మేయర్, చైర్‌పర్సన్ ఎన్నిక

## - తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో విధి విధానాలు ఇవే

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 116 మున్సిపా లిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లలోని 2,996 వార్డులకు ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అయితే తాజాగా మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్లు, మున్సిప్ కార్పొరేషన్‌లలో మేయర్ ఎన్నికకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని ప్రకటించింది. ఎన్నికల సంఘం విధివిధానాలు ఇలా ఉన్నాయి ఈ నెల 16న మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. ఈ ఎన్నికలో ప్రజలు ఎన్నుకున్న వార్డు సభ్యులతో పాటు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులు. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలుగా ఉంటారు. వీరు తాము ఏదో ఒక మున్సిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 14న సాయంత్రం 5 గంటల్లోపు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదు కావాల్సి ఉంటుంది. ఎక్స్‌అఫీషియో సభ్యుల వివరాలతో మేయర్, చైర్‌పర్సన్ ఎన్నికకు ఒక రోజు ముందు ఫారమ్-2 నోటీసులు ఇస్తారు. మేయర్, చైర్‌పర్సన్‌ల ఎన్నికకు ముందు పార్టీలకు విప్ జారీ చేసే అవకాశం ఉంటుంది. ఫిబ్రవరి 16న ఉదయం 11 గంటలకు కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం ఉంటుంది. ఆ తర్వాత మున్సిపాలిటీలలో చైర్పర్సన్, మున్సిపల్ కార్పొరేషన్‌లలో మేయర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నారు. కొత్తగా ఎన్నికైన వార్డు మెంబర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిసి కనీసం 50 శాతం సమావేశానికి హాజరైతేనే కోరం ఉన్నట్లుగా పరిగణించి ఎన్నిక నిర్వహించాలి. బహిరంగంగా చేతులు ఎత్తే పద్ధతిలో ఈ ఎన్నిక చేపట్టాలి. పార్టీ విప్‌ను ధిక్కరించే వారిపై చర్యలు ఉంటాయి. ఒకవేళ ఫిబ్రవరి 16వ తేదీన కోరం లేకపోయినా, ఇతర కారణాల వల్ల చైర్‌పర్సన్, మేయర్ ఎన్నిక జరగని పక్షంలో మరుసటి రోజు ఎన్నిక నిర్వహిస్తారు. అయితే ఆరోజు కూడా ఎన్నిక జరగని పక్షంలో ఎన్నికల సంఘం మరో రోజు ఖరారు చేయనుంది.

### ఎక్స్‌అఫీషియో సభ్యుల నమోదు..

తెలంగాణ మున్సిపాలిటీల చట్టం- 2019లోని సెక్షన్ 20 (1) ప్రకారం సెక్షన్ 5(3)లో వివరించిన విధంగా ఎక్స్‌అఫీషియో సభ్యుల నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే నమోదు చేసుకున్న వారి వివరాలు ఈ నెల 4వ తేదీలోగా పంపాలని సూచించింది. కొత్తగా నమోదు చేసుకునే వారికి ఈ నెల 11 నుంచి 14 వరకు అవకాశం ఇవ్వనున్నట్లుగా తెలిపింది. ఎమ్మెల్యేలు, లోక్‌సభ సభ్యులు తమ అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఏదో ఒక మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకోవచ్చు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు రాష్ట్రంలో ఏదో ఒక మున్సిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్‌లో నమోదు కావచ్చు.

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ
# నాయకుల హడావిడి

## - సమస్యలు పరిష్కరించడంలో పోటీ పడుతున్న నాయకులు - ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు వెనుక పడ్డారా.?
## - ఎప్పుడు కనిపించని సమస్యలు నాయకులకు ఇప్పుడే కనిపిస్తున్నాయా.? - టికెట్ల కోసం తిప్పలు పడుతున్న నాయకులు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జిహెచ్ఎంసి ఎన్నికలు ఎప్పుడు ఉంటాయో తెలవదు. కానీ పోటీలు పడి ప్రజా సమస్యలు వెతుక్కుంటున్న నాయకులు వెళుతున్నారు. అధికార ప్రతిపక్ష నాయకులు సొంత ఖర్చులతో ప్రజల సమస్యలు తీరుస్తామని దాడులు చేసుకుంటున్నారు అది కూడా సొంత ఖర్చులతో ఎన్నికల సమయం ఎలా మార్చిందో అని ప్రజలు ఆశ్చర్యానికి వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాదులో కార్పొరేటర్ల పదవీకాలం ముగింపు దశలో ఉండడంతో ప్రధమ, ద్వితీయ శ్రేణి పార్టీ నాయకులు పోటీపడి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో నిలబడుతున్నారు. ప్రజా సమస్యలపై ఎప్పుడూ పట్టించుకోని ఆ నాయకులు ఎన్నికల సమయం రాగానే ప్రజా సమస్యలు తీర్చడంలో మేము ముందున్నామని మా నాయకులు సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారని మా పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై ఎప్పుడూ పోరాడుతుందని మా పార్టీ అధికారంలో ఉందని డివిజన్లో మా కార్పొరేటర్ అధికారంలో ఉన్నాడని ఇలా చెప్పుకుంటూ ప్రజల ముందుకు వెళుతున్న నాయకులను చూసి ప్రజలు హాస్యాస్పదంగా చర్చించుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజా సమస్యలు కనిపిస్తున్నాయా అని ప్రజలు నవ్వుకుంటున్నారు.

### సమస్యలను వెతుక్కుంటున్న నాయకులు..

ప్రజా సమస్యలపై ఏనాడు స్పందించని నాయకులు కూడా ఎన్నికల సమీపిస్తున్న యనగానే హడావుడి చేస్తూ ఎక్కడలేని సమస్యలను తీరుస్తామని గల్లి గల్లి తిరుగుతూ సమస్యలు ఎక్కడున్నాయని వెతుక్కుంటూ ప్రజలను అడుగుతున్నారు. ఇప్పటివరకు ఉన్న నాయకులు సమస్యలను పరిష్కరించలేదా ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేద్దామని అనుకుంటున్నా నాయకులకు సమస్యలు గుర్తొస్తున్నాయా.? అని ప్రజలు మనసు పూర్తిగా నవ్వుకుంటున్నారు. సమస్యలపై ఫోన్లు చేస్తే ఏనాడు ఎత్తని నాయకులు ఇప్పుడు టక్కుమని ఫోన్లు ఎత్తి సమస్య ఉంది అనగానే ఆగమేఘాల మీద పరిగెత్తుకుంటూ వస్తున్నారంటే రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో మేము పోటీ చేస్తున్నామని మమ్మల్ని గెలిపించాలని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలపడం విడ్డూరంగా మారింది.

### ఎన్నికల ముందు ఓటర్లు దేవుళ్ళు అయిపోతారు..

ఎన్నికల సమీపిస్తున్నాయంటే ప్రజలను మోసం చేయాలనుకుంటున్న నాయకులకు ఓటర్లు దేవుడి రూపంలో కనిపిస్తారని, ఎన్నికలు అయిపోయాయి అంటే ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటాయని ఎన్నికల అప్పుడు హడావుడి, వాగ్దానాలు, శబదాలు చేసే నాయకులు ఎన్నికలు అయిపోయాక సమస్యలపై ఎందుకు స్పందించరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వివిధ కాలనీలలో ప్రజలకు సమస్య వచ్చిందంటే అక్కడ నాయకులు వాలిపోతున్నారని సమస్యలను ఇప్పటివరకు ఉన్న నాయకులు పరిష్కరించలేదా అని ప్రశ్నిస్తున్నారు. ఓ స్థాయిలో ఒకే సమస్యను నేను తీరుస్తాను అంటూ నాయకులు కొట్లాడుకునే వరకు పోయి ఒకరిపై ఒకరు ఒక కేసులు పెట్టుకునే వరకు పరిస్థితులు వెళుతున్నాయి అంటే నాయకులు ఎంత స్వార్థపూరితంగా మారిపోయారో అర్థం చేసుకోవచ్చు.

### ఎన్నికలు ఎప్పుడో తెలియదు, ఇప్పటినుండి ప్రజలను కాకా పట్టడమే..

గ్రేటర్ హైదరాబాదులో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలవదు. కానీ కార్పొరేటర్ గా ఎన్నికల్లో పోటీ చేసే నాయకులు, ప్రస్తుత కార్పొరేటర్లు, కార్పొరేటర్ల రేసులో ఉన్న నాయకులు ప్రజా సమస్యలను ఇట్టే తీరుస్తామని పోటీలు పడుతున్నారని, ఎమ్మెల్యే ఎంపీ ఇన్చార్జిల పేర్లు చెప్పి సమస్యలను పరిష్కరిస్తామని నాయకులు చెప్పడం చూస్తుంటే నాయకులకు ప్రజల సమస్యలపై ఎంత చిత్తశుద్ధి వచ్చిందో.? ఎన్నికలు 5 సంవత్సరాలకు ఒకసారి కాకుండా ప్రతి సంవత్సరం ఉంటే అసలు ప్రజలకు సమస్యలు



ఉండదేమో అనిపిస్తుంది ఈ నాయకులను చూస్తుంటే. ఇప్పటికైనా ప్రజా సమస్యను పరిష్కరించడంలో నాయకులు పోటీలు పడి సమస్యలను పరిష్కరిస్తున్నారంటే పదవి వ్యామోహం ఎంతుందో. ఓటు విలువ ఎంత విలువైనదో నాయకులకు తెలుసని ప్రజలు ఆ ఓటును అమ్ముకోకుండా నిజమైన నాయకుడికి ఓటు వేసి గెలిపించి, ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడిని గెలిపించుకోవాలి.

# ఫైర్ సేఫ్టీ పాఠాలు చెబుతున్న హైడ్రా

## - ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వాడకం, భద్రతా చర్యలపై ప్రాక్టికల్ డెమోలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే లక్ష్యంతో ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన కల్పించేందుకు నగరం నలుమూలలా భారీ ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించింది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ షోరూంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పాటు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనలు ఈ చర్యలకు ప్రధాన కారణంగా నిలిచాయి. చాలా వాణిజ్య భవనాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని అధికారులు జరిపిన తనిఖీల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో, అగ్నిమాపక భద్రతా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేందుకు వాణిజ్య సంస్థలకు నెల రోజుల గడువు ఇస్తూనే, మరోవైపు ఈ అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ ప్రమాదం సంభవిస్తే మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలనే అంశాలపై వివరిస్తున్నారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగం, మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే ఆటోమేటిక్ వాటర్ స్ప్రింక్లర్లు, పొగను గుర్తించే స్మోక్ డిటెక్టర్ల పనితీరుపై ప్రాక్టికల్‌గా చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. షాపులు, కార్యాలయాల్లో ఫైర్ ఎగ్జిట్ మార్గాలను




గుర్తించడం, వాటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతున్నారు. పంజాగుట్ట, మాదాపూర్, గచ్చిబౌలి-మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ క్లాక్ టవర్, అల్వాల్, బంజారాహిల్స్, శంషాబాద్, కొంపల్లి, నాంపల్లి వంటి 30కి పైగా ప్రధాన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కొన్ని చోట్ల ఫైర్ మాక్ డ్రిల్స్ కూడా నిర్వహించి, ప్రమాద సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో కార్మికులకు, వ్యాపారులకు సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖకు చెందిన 101 నంబర్‌తో పాటు, హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 1070 లేదా మొబైల్ నంబర్ 9000113667కు ఫోన్ చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# రూల్స్ అమలు చేయకుంటే
# దేశంలో నుంచి వెళ్లిపోండి

## - వాట్సాప్ కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దేశంలో వ్యాపారం చేయాలంటే భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిందేనని, రాజ్యాంగ విలువలను, నిబంధనలను పాటించి తీరాలని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనలను పాటించకుంటే దేశం విడిచి వెళ్లాల్సిందేనని వాట్సాప్ మాతృసంస్థ మెటాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఈ రోజు జరిగిన విచారణలో వాట్సాప్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనల విషయంలో వాట్సాప్ తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్ అయింది. వాట్సాప్ యూజర్ల వివరాలను, డేటాను మెటాతో పంచుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. డేటా షేరింగ్, మార్కెట్ ఆధిపత్యానికి సంబంధించి గత నెలలో ఎన్సీఎల్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వాట్సాప్, మెటా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సాప్ పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ వ్యాఖ్యలు చేశారు. 'మీరు మా దేశ పౌరుల గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలో ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేము అనుమతించబోము' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అమెరికా సంస్థ మెటాకు తేల్చిచెప్పారు. భారత చట్టాలను పాటించలేకపోతే దేశం వదిలి వెళ్లాలని సూచించారు. డేటా షేరింగ్ ఉండదని హామీ ఇవ్వాలని, లేదంటే ఈ కేసును కొట్టేస్తామని హెచ్చరించారు. చాట్ ట్రెండ్‌ల ఆధారంగా ప్రకటనలతో సహా వినియోగదారు డేటా ప్రవర్తన, వాణిజ్య దోపిడీ వినియోగదారుల హక్కులను ఉల్లంఘిస్తుందని కోర్టు తెలిపింది. వైద్యులతో ప్రైవేట్ చాట్‌ల తర్వాత వినియోగదారులు ఔషధాల కోసం ప్రకటనలను అందుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసింది. ఇది డేటా మానిటైజేషన్ పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

# భారత్, అమెరికా మధ్య
# చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం

## - ట్రేడ్ డీల్ పై సీఎం చంద్రబాబు స్పందన



అమరావతి (ప్రశ్న న్యూస్) భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత, రైతులకు కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పార్టీ నిర్ణయాన్ని కాదని
# బరిలో నిలిస్తే సస్పెన్షనే దిక్కు

## - రెబల్స్‌కు జగ్గారెడ్డి గట్టి హెచ్చరిక



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలకు కూడా రెబల్స్ బెడద తప్పడం లేదు. ఈ క్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ అభ్యర్థులకు హెచ్చరిక జారీ చేశారు. తనను, పార్టీ నిర్ణయాన్ని కాదని ఎవరైనా నామినేషన్ వేస్తే వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం ఇప్పటికే అభ్యర్థులకు బీ-ఫామ్‌లు అందజేసింది. పోటీకి ఆసక్తి చూపుతున్న మిగిలిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుని పార్టీ బీ-ఫామ్ ఇచ్చిన అభ్యర్థులకు సహకరించాలని జగ్గారెడ్డి సూచిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588